క్లుప్తంగా

కోసిగి సీఐగా జి.ప్రసాద్



కోసిగి: స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐగా జి.ప్రసాద్ శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఎరిసా వలి మంత్రాలయంకు బదిలీ అయ్యారు. ప్రసాద్ కర్నూలు స్పెషల్ బ్రాంచ్ నుంచి బదిలీపై వచ్చారు. నూతన సీఐకి ఎరిసావలి, కోసిగి, కౌతాళం, మంత్రాలయం ఎస్ఐలు సతీష్‌కుమార్, నరేంద్ర కుమార్ రెడ్డి, వేణుగోపాల్ రాజ్ శాలువా, పుష్ప గుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ముగ్గుల పోటీలు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని వాగ్దేవి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి పండుగ ముగ్గుల పోటీలను నిర్వహించారు. హెచ్ఎం సురేష్ అధ్యక్షతన జరిగిన ముగ్గుల పోటీలలో విద్యార్థినులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయినులు రేణుక, శ్వేతబాయి వ్యవహరించారు. ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

గ్యాస్ లీకేజీ.. ఇద్దరికి గాయాలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని అమరావతినగర్ కాలనీకిలో శనివారం ఇంట్లో జరిగిన గ్యాస్ లీకేజీ కారణంగా చోటుచేసుకున్న ప్రమాదంలో తల్లి పుష్ప, కుమారుడు రాఘవేంద్రకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉదయం వేడి నీళ్ల కోసం స్టవ్‌ను వెలిగించగా గ్యాస్ లీకవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో తల్లి, కుమారుడికి గాయాలయ్యాయి. పరీక్షించిన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

విద్యుత్ తీగల తొలగింపు



పెద్దతుంబళంలో ఇళ్లపై నుంచి వెళ్లిన విద్యుత్ తీగలను తొలగిస్తున్న సిబ్బంది

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ప్రమాదకరంగా ఇళ్లపై నుంచి వెళ్లిన విద్యుత్ తీగలను ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు తొలగించినట్లు సర్పంచ్ ఉచ్చప్ప తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి ప్రమాదరకరంగా ఉన్న తీగలను తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు ఇళ్లపై నుంచి వెళ్లిన 11000 వాట్స్ కలిగిన విద్యుత్ తీగలను సిబ్బంది తొలగించారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆదోనిరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ, కార్మిక సంఘం నాయకులు కోరారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల గుండా ప్రదర్శనగా భీమాస్ సర్కిల్ వరకు చేరుకుని ఒంటి కాలిపై నిల్చొని నిరసన తెలియజేశారు. ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా సమితి సభ్యులు అజయ్ బాబు, కల్లుబావి రాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ తరగతులు

కర్నూలు (లీగల్): జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర్ పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వలంటీర్లకు ఫ్యామిలీ లా, గృహ హింస చట్టం, విడాకుల చట్టం, మధ్యవర్తిత్వం, భరణం, ఫ్రీ లీగల్ ఎయిడ్, లీగల్ సర్వీస్ అథారిటీ యాక్ట్ 1987, న్యాయ విజ్ఞాన సదస్సుల ప్రాముఖ్యత, లీగల్ ఎయిడ్ టు ప్రకృతి వైపరీత్యాలకు న్యాయ సేవల పథకం తదితర చట్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ఈనెల 12, 13 తేదీల్లో రాజంపేటలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం రామక్రిష్ణ అన్నారు. శనివారం స్థానిక బి. క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో హ్యాండ్‌బాల్ క్రీడను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

దేవనకొండలో చోరీ

దేవనకొండ: స్థానిక తిక్కతాత దర్గా సమీపంలో నివాసముంటున్న ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవర్ జగ్గాపురం మజీద్ ఇంట్లో శనివారం మధ్యాహ్నం చోరీ జరిగింది. 8 తులాల బంగారం, రూ.29 వేల నగదు, 30 తులాల వెండి చోరీకి గురైంది. ఎస్ఐ భూపాలుడు కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఫింగర్ ప్రింట్స్ సేకరించారు.



కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



సభకు హాజరైన లబ్ధిదారులు

అవ్వతాతల మోములో ఆనందం

మంత్రాలయం : మలిదశలోనున్న అవ్వతాతల మోములో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆనందం నింపారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం కౌతాళం మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ లబ్ధిదారులకు వ్యయప్రయాశలు లేకుండా ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్న ఏకైన ప్రభుత్వం తమదేనన్నారు. మండలంలో కొత్తగా 32 మందికి కొత్త పింఛన్లురాగా మొత్తం 8,979 పింఛన్లు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే పింఛన్ మొత్తాన్ని ప్రస్తుతం రెండింతలు పెంచామన్నారు. అధికార దాహంతో టీడీపీ నేత చంద్రబాబు లేనిపోని హామీలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఆయన మోసపూరిత మాటలు నమ్మి మోసపోకండని ప్రజలకు సూచించారు. ప్రజల దీవెనలు ఉన్నంతకాలం తమ పార్టీకీ ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.

పేదల సంతోషమే ప్రభుత్వ ధ్యేయం



వృద్ధురాలితో మాట్లాడుతున్న వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : పేదల సంతోషమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని వైఎస్సార్సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యులు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దకడబూరు సచివాలయం-1లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి జరుగుతోందన్నారు. పేదల సంక్షేమం కోసం జగనన్న చేస్తున్న కృషి అమోఘమన్నారు. మునుపెన్నడూ లేని విధంగా పారదర్శకంగా పథకాలు అందిస్తుండటం ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నేతలు మోసపూరిత ప్రకటనలతో మీ వద్దకు వస్తారని, వారిని నమ్మొద్దని సూచించారు. టీడీపీ నేతల మాయమాటలు చెప్పినా మోసపోయే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. ఈ ఎన్నికలతో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచు రామాంజనేయులు, ఉరుకుంద ఈరన్న స్వామి ట్రస్టుబోర్డు మెంబర్ విజయేంద్ర రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రారెడ్డి, నాయకులు గజేంద్రరెడ్డి, నవీన్‌రెడ్డి, శివరామిరెడ్డి, తహసీల్దార్ వీరేంద్రగౌడ్, ఆర్ఐ మహేష్ పాల్గొన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఆదోనిరూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎన్ఎంఆర్‌లను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఈరన్న, పట్టణాధ్యక్షుడు తిప్పన్న కోరారు. సమస్యలు పరిష్కరించాలని వారు చేపట్టిన సమ్మె శనివారానికి 11వ రోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికుల సర్వీసును పరిగణలోకి తీసుకొని పర్మినెంట్ చేయాలన్నారు. అలాగే కార్మికులకు యూనిఫాంలు ఇవ్వాలని, 101 పద్దు కింద వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ నాయకులు కర్రెప్ప, సోమన్న, అహ్మద్, మూర్తి, ఈరన్న పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శివన్న



ఆదోనిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుడిసె శివన్న నియమించబడ్డారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు, రాయలసీమ ఇన్‌చార్జి నాగశేషయాదవ్ శనివారం ప్రకటించారు. ఈ మేరకు గుడిసె శివన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.



సావిత్రీబాయి వేషధారణలో విద్యార్థినులు

సావిత్రీబాయి పూలే జయంతి

ఆదోనిరూరల్: మండలంలోని నాగనాథనహళ్లిలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో శనివారం మొదటి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే జయంతి వారోత్సవాలను చేపట్టారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి బోధన చేశారు. హెచ్ఎం సురేంద్రనాథ్‌గుప్తా మాట్లాడుతూ ఆమె ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆమె చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు అనురాధ, మాలు, ఉరుకుందయ్య, హసీనా, శ్వేత పాల్గొన్నారు.

ఫైలేరియాపై అవగాహన



రక్త పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర: ఫైలేరియాపై ప్రజలకు అవగాహన కలిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 300 మందికి ఫైలేరియా పరీక్షలు చేశామన్నారు. ఫైలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమకాటు నుంచి రక్షణకు దోమ తెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం



జస్టిస్ శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న అడ్వకేట్లు

ఆదోనిరూరల్: పట్టణంలో శనివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఉదయం రెడ్డి హాస్టల్‌లో పాల్గొన్న ఆయనకు ఆదోని బార్ అసోసియేషన్ నాయకులు అనితాబాయి, అబ్దుల్‌అన్సారీ కలిసి జస్టిస్ శ్రీనివాసరెడ్డిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కోర్టు భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అడ్వకేట్లు జడ్జికి విజ్ఞప్తి చేశారు. అలాగే జడ్జీలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరారు. ఆయన స్పందిస్తూ త్వరలో సమస్యలను పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీనియర్ న్యాయవాదులు మన్సూర్‌అహ్మద్, విరుపాక్షిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, తాయన్న, ఇస్మాయిల్, కళ్యాణ్‌రెడ్డి, కబీర్, పూజారి ఈరన్న పాల్గొన్నారు.

శ్రీరంగనాథునికి ప్రత్యేక పూజలు



పల్లకీలో కొలువుతీరిన స్వామివారు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన ప్రసిద్ధి శ్రీరంగనాథస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి బిందె సేవ, అష్టోత్తరనామార్చన, అభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరంగనాథుడు శ్రీదేవి, భూదేవి సమేతుడై పల్లకీలో ఆలయ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ దస్తగిరిగౌడ్ పాల్గొన్నారు.



సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

పేదల అభ్యున్నతికి జగనన్న కృషి

మంత్రాలయం : పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం కౌతాళం మండలం బదినేహాల్ గ్రామంలో కాచాపురం సర్పంచు వై.జయమ్మతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం తరఫున మంజూరైన సంక్షేమ ఫలాలపై ఆరా తీశారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం శ్రమించిన ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ప్రతి పేదోడి ఇంట్లో సంతోషం చూడాలనే ఆశయంతో జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు వర్తింపజేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. టీడీపీ హయాంలో కేవలం తమ అనుకూలురుకే పథకాలు ఇచ్చారని గుర్తు చేశారు. అందుకు భిన్నంగా జగనన్న పాలన సాగించడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించారని, చంద్రబాబు మాయమాటలు నమ్మే రోజులు పోయాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలంటే మరోమారు జగనన్నను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పన కోసం రూ.40 లక్షలతో శాశ్వత పనులు చేపడతామన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఉరకుంద ఈరన్న స్వామి ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజగౌడ్, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ రామలింగయ్యస్వామి, ఎంపీడీఓ సుబ్బరాజు, నాయకులు గురురాఘవేంద్రరెడ్డి, దాట్ల సుబ్బరాజు, తహసీల్దార్ రామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు



సీఐ గోపీచంద్

ఆదోనిఅర్బన్: ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా గోపీచంద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలులో వీఆర్ నుంచి బదిలీపై వచ్చారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న శ్రీనివాసనాయక్ కర్నూలు వీఆర్‌కు వెళ్లారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన గోపీచంద్ సీఐగా తిరుపతి ఎస్‌బీలో పనిచేశారు. ఆ తర్వాత కర్నూలు వీఆర్‌కు వచ్చారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదట పోస్టింగ్ ఆదోని టూటౌన్‌కు వచ్చినట్లు తెలిపారు.

ట్రాఫిక్ సీఐగా..

పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐగా మంజునాథ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న సీఐ పార్థసారథి కర్నూలు వీఆర్‌కు వెళ్లారు. మంజునాథ్ 2002 బ్యాచ్‌కు చెందిన ఎస్ఐ. మొదట కర్నూలు టూటౌన్ ఎస్ఐగా, అనంతరం బనగాన పల్లె, కోయిలకుంట్ల, జూపాడుబంగ్లాలో పనిచేస్తూ సీఐగా 2018లో సీఐగా కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అనంతరం సీఐడీలో రెండున్నర సంవత్సరాలు పనిచేసి, ఆ తర్వాత ఎమ్మిగనూరు రూరల్‌కు, అక్కడి నుంచి కర్నూలు త్రీటౌన్‌కు, అక్కడి నుంచి ఆదోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.



ట్రాఫిక్ సీఐగా మంజునాథ్

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోనిరూరల్: అర్హులందరికీ పింఛన్లను అందించడమే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని 44 గ్రామాలకు చెందిన 228 మంది నూతన లబ్ధిదారులకు శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధాప్య పింఛన్‌లు 114, దివ్యాంగ పింఛన్లు 37, వితంతు పింఛన్లు 77 మంజూరయ్యాయని చెప్పారు. 14 యేళ్లపాటు సీఎంగా ఉన్న చంద్రబాబునాయుడు పింఛన్ల పథకానికి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్‌ను అందించేలా చర్యలు చేపట్టారన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబునాయుడు ఉత్తుత్తి హామీలను ఇస్తున్నారని, వాటిని జనం నమ్మేస్థితిలో లేరన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, ఎంపీపీ దానమ్మ, మాజీ ఎంపీపీ పంపాపతి, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడులు గురునాథ్‌రెడ్డి, ఆయాశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

12 యేళ్లు పింఛన్ కోసం తిరిగాను



నా భర్త చనిపోయిన 12 యేళ్లు అయ్యింది. పింఛన్ కోసం నాయకులు, అధికారుల చుట్టూ తిరిగాను. అయినా పింఛన్ రాలేదు. ఇటీవల మా గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయి అన్న పర్యటించినప్పుడు నా కష్టాన్ని ఆయనకు చెప్పుకున్నా. వెంటనే పింఛన్ మంజూరు చేయించారు. ఎమ్మెల్యేను, ముఖ్యమంత్రిని జీవితంలో మరువను. – లక్ష్మి, పెద్దతుంబళం గ్రామం

వితంతు పింఛన్ వచ్చింది



నా భర్త ఐదు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామ వలంటరీ ద్వారా సచివాలయానికి వెళ్లి పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ఐదు నెలలోపే పింఛన్ మంజూరైంది. రూ.3 వేలు అందుకోవడం సంతోషంగా ఉంది. కుటుంబ పెద్ద లేక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తమకు ప్రభుత్వం సహకారం చేయడం సంతోషంకరం. జగనన్నకు రుణపడి ఉంటా.

– గోవిందమ్మ, నాగలాపురం గ్రామం



సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పింఛన్‌దారులు



అగసనూరులో పింఛన్‌లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గ్రామాల్లో పింఛన్ల పండగ

కోసిగి: మండలంలోని వివిధ గ్రామాల్లో అవ్వతాతలకు రూ.3వేలు పింఛన్ పెంచి అందించడంతో పింఛన్ దారులు సంబరాలు చేసుకుంటున్నారు. శనివారం పెద్ద భూంపల్లి గ్రామంలో లబ్ధిదారులు సీఎం జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కోసిగిలో వైఎస్సార్ సీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేపట్టారు. అగసనూరులో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకాష్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేపట్టారు. కోసిగి మండలంలో గత నెల 7444 పింఛన్లు వస్తుండగా ప్రస్తుతంగా అదనంగా కొత్త 116 పింఛన్లు మంజూరయ్యాయి. ఇందుకు గానూ రూ.2,26,80,000 మంజూరైందని ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు పింఛన్ అందజేస్తామని చెప్పారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ గిరిజమ్మ

మంత్రాలయం : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ గిరిజమ్మ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులపై పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాలో పనిచేయాలన్నారు. ప్రభుత్వం తరఫున ప్రతి గ్రామంలోనూ గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నారని, జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి పనులు చేపట్టామన్నారు. ఇటీవల ఎంపీడీఓ కార్యాలయానికి మరమ్మతులు చేశామని చెప్పారు. సమావేశంలో వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి, సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, ఎంపీడీఓ మణిమంజరి, డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


4న విజయవాడలో గ్రామీణ వైద్యుల మహాసభ

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ వైద్యుల సంఘాల సమాఖ్య (ఫెడరేషన్) ఆధ్వర్యంలో విజయవాడలో వచ్చే నెల (ఫిబ్రవరి) 4వ తేదీన గ్రామీణ వైద్యుల మహాసభ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామీణ వైద్యుల పోరాట సభ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేజీ గోవిందరెడ్డి చెప్పారు. శనివారం స్థానిక బుధవారపేటలోని పద్మచంద్ర నర్సింగ్ కళాశాల ఆడిటోరియంలో కర్నూలు జిల్లా గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాసభ, క్యాన్సర్‌పై పోరాట సభ పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 4వ తేదీన గ్రామీణ వైద్యులందరూ విజయవాడ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తెలకపల్లి రాధాకృష్ణయ్య, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు/నంద్యాల జిల్లా అధ్యక్షులు నాగేశ్వర రెడ్డి, రాష్ట్ర నాయకులు ఉస్మాన్, దస్తగిరి పర్ల, ఇల్లూరు నరసింహ, రఘునాథరెడ్డి, నాగేశ్వరరావు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

నాడు కంప చెట్లు.. నేడు కల్పతరువు



నాడు ముళ్ల పొదలతో మూసుకుపోయిన భూగేని చెరువు



నేడు నీటితో కళకళలాడుతున్న దృశ్యం

- కోసిగి భూగేని చెరువుకు పూర్వ వైభవం
- నాడు ముళ్ల పొదలు, పూడికతో నిండిపోయిన వైనం
- ఎమ్మెల్యే సొంత నిధులు రూ.40 లక్షలతో రూపు
- నేడు నిండు కుండను తలపిస్తున్న చెరువు
- తీరనున్న కోసిగి ప్రజల దాహార్తి

కోసిగి: భూగేని చెరువు..మొన్నటి వరకు ముళ్లపొదలు పెరిగిపోయి.. పూడికతో నిండిపోయి ఆనవాళ్లు కోల్పోయింది. నేడు నీటితో నిండుగా కళకళలాడుతోంది. మండల కేంద్రం శివారులో వర్షపు నీరు నిల్వ ఉండేందుకు గతంలో ఏర్పాటు చేసిన భూగేని చెరువు ఇన్నేళ్లు పూర్తిగా ముళ్ల పొదలతో నిండిపోయింది. కోసిగిలో ఏడాదికేడాదికి జనాభా పెరిగిపోవడంతో నీటి సమస్య తీవ్రంగా మారింది. చెరువును పునరుద్ధరిస్తే సమస్యను పరిష్కరించవచ్చని భావించిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సొంత నిధులు రూ.40లక్షలు వెచ్చించి చెరువులో ముళ్ల పొదలు, పూడికతీత పనులు చేపట్టి తీర్చిదిద్దారు. పులికనుమ రిజర్వాయర్‌కు వెళ్లే పైప్‌లైన్ నుంచి భూగేని చెరువులోకి నీటిని మళ్లించేలా చర్యలు చేపట్టారు. చెరువులోకి నీళ్లు చేరడంతో నిండుగా కళకళలాడుతోంది. త్వరలోనే ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేసి సురక్షిత మంచి నీటిని సరఫరా చేసి కోసిగి ప్రజల దాహార్తి తీరుస్తామని అధికారులు చెబుతున్నారు. నిరుపయోగంగా మారిన చెరువు నేడు కల్పతరువులా మారి పట్టణం దాహార్తి తీర్చనుండటంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.